క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

సదుం: మండలంలోని గొంగివారిపల్లెకు చెందిన కుమారస్వామికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. బాధితుడు గతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందాడు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో అతడికి సీఆర్‌ఎఫ్ మంజూరైంది. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థికసాయం చేస్తున్న పార్టీ నేతలు

రామకుప్పం: మండలంలోని అంకిరెడ్లపల్లెకు చెందిన సుబ్బన్న, వర్తికుప్పంకు చెందిన జబ్బార్‌బాషా, బందార్లపల్లె పంచాయతీ తగరాల తాండాకు చెందిన కృష్ణవేణి మంగళవారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ మృతుల కుటుంబాలకు రూ.10వేల చొప్పున స్థానిక నేతల ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ సుబ్రమణ్యం, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ నితిన్ రెడ్డి, బందార్లపల్లె సర్పంచ్ రాజగోపాల్, కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ ఆనందప్ప, మంజునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన


చప్పిడిపల్లెలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, ఆరోగ్య సిబ్బంది


బైరెడ్డిపల్లె: వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని చప్పిడిపల్లెలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్ కళ్యాణ్ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల తనిఖీ


ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

రామకుప్పం: మండలంలోని పలు ఎండీయూ వాహనాలను తహసీల్దార్ మురళి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ఎండీయూ ఆపరేటర్లు ఈ నెల 15వ తేదీ లోపు నిత్యావసర సరకులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే వాటిని ఇవ్వాలన్నారు. రోజుకు 200 మంది లబ్ధిదారులకు సరుకులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీటీ దిలీప్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ


పలమనేరు : క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

పలమనేరు: ఎస్టీయూ–2024 క్యాలెండర్లు, డైరీలను స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఎంఈఓ లీలారాణి మంగళవారం ఆవిష్కరించారు. మండల ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, భాస్కర్, వెంకటప్ప, రాష్ట్ర కౌన్సిలర్ సుబ్రమణ్యం, గౌరవాధ్యక్షులు రజాక్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.
గంగవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్టీయూ క్యాలెండర్లను ఎంఈఓ–1, 2 వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులుతో కలిసి ఆ యూనియన్ నాయకులు ఆవిష్కరించారు.

వైఎస్సార్ సీపీ సమావేశం రేపు

రామకుప్పం: మండలంలో 23 పంచాయతీలలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆకుందగానిపల్లెలోని చంద్రారెడ్డి గెస్ట్‌హౌస్ వద్ద గురువారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తనతోపాటు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి తదితరులు సమీక్షిస్తామన్నారు.

జగనే మా ధైర్యం

- పింఛను రూ.3వేలకు పెంపుపై హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



పలమనేరు: ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ పెన్షన్ కానుకను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3వేలకు పెంచారు. పెన్షన్లకు ఏటా పెంపుదల చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. విశ్వసనీయతకు అర్థం చాటారు. గతటీడీపీ పాలనలో పింఛన్ రూ.1000గా ఉండగా వైఎస్సార్ సీపీ పాలనలో 2019లో రూ.2,250, 2022 జనవరిలో రూ.2,500, 2023 జనవరిలో రూ.2,750, తాజాగా ఇప్పుడు రూ.3వేలకు సీఎం పెంచడంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వ్యాధిగ్రస్తులు, ఇతర లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవనానికి, మందుల కోసం తాము ఇబ్బంది పడకుండా మనవడిలా, ఇంటికి పెద్దకొడుకులా, అన్నయ్యలా ఆదుకుంటున్నాడని చెమర్చిన కళ్లతో చెబుతున్నారు.

జగనన్నే నాలాంటి వాళ్లకి అండ

నేను వితంతు పింఛను తీసుకుంటున్నా. ఈనెల నుంచి మూడువేలు రావడం సంతోషంగా ఉంది. మాలాంటోళ్లకు తోడూనీడగా నిలిచిన జగనన్నను ఎన్నటికీ మరువలేము. ఈ కాలంలో ప్రతి నెలా ఇంటికొచ్చి సాయం చేసేవాళ్లు లేరు. అలాంటిది మా బాగు కోసం ఆయన చేస్తున్న సాయం మాకు ఎంతో ఉపయోగమవుతోంది. ఇంటి అవసరాలకు ఉపయోగపడుతోంది. –ధన, గంటావూరు

పలమనేరు నియోజకవర్గంలో పింఛన్ల వివరాలు

మండలం	పెన్షన్లు	కొత్త పింఛన్లు	మొత్తం పింఛన్లు	మొత్తం నగదు
పలమనేరు మున్సిపాలిటీ	4,646	103	4,749	1,46,29,000
పలమనేరు	4,612	53	4,665	1,34,19,500
బైరెడ్డిపల్లె	7,898	100	7,998	2,20,66,250
వీకోట	11,408	161	11,569	3,45,34,000
గంగవరం	8,340	100	8,440	2,50,68,500
పెద్దపంజాణి	8,329	101	8430	2,48,19,500
మొత్తం	45,233	618	45,851	రూ.13,45,36,750

నెల వస్తే జగన్‌మోహన్‌రెడ్డికి మొక్కుతా!

ఇంతకు ముందు కూడా పింఛను తీసుకుంటా ఉంటిని. పోస్టాఫీసుకు వెళ్లి రోజంతా అవస్థలు పడేవాళ్లం. పింఛను ఇస్తారంట..నన్ను అక్కడికి తీసుకెళ్లండని ఇంట్లో వాళ్లను తోడుగా తీసుకుపోయేవాడిని. అక్కడ టవర్ సిగ్నల్ అందకుంటే పింఛను కోసం పడిగాపులు కాసేవాళ్లం. జగను వచ్చాక ఏ బాధ లేదయ్యా. వలంటీర్ ఇంటికాడికొచ్చి, డబ్బులిచ్చి వెళుతున్నారు. ఇప్పుడు నెలకు మూడు వేలంటే నాకు చాలా ఆనందంగా ఉంది. ఇదంతా జగన్‌మోహన్‌రెడ్డి చలువే. ఆయన ఎప్పటికీ చల్లగా ఉండాలయ్యా. – దస్తగిరి సాబ్, ఎస్వీజీ స్ట్రీట్, వీ.కోట

మాకు జగనున్నాడనే నిశ్చింత

పింఛను పెంచిన జగన్ మాలాంటోళ్లకు ఉన్నాడనే కొండంత ధైర్యం ఉంది. మమ్మల్ని ఎవరూ పట్టించుకోకున్నా నెల వచ్చిందంటే మా వలంటీర్ ఇంటికొచ్చి పింఛను ఇస్తోంది. మా అవసరాలకు ఈ డబ్బు ఎంతో పనికొస్తుంది. ఆయన చల్లగా ఉండాలయ్యా. ఏ టెన్షన్లూ లేకుండా బతుకుతున్నామంటే దానికి కారణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. ఆయన మళ్లీ సీఎంగానే ఉండాలి. – గౌరమ్మ, ఎల్‌టీ నగర్, పలమనేరు

బాధ్యతగా సేవ

మొదట్లో వలంటీర్లంటే జనంలో కాస్త చిన్నచూపుండేది. ఇప్పుడలా కాదు.. ప్రభుత్వ పథకాల అమలులో కీలకంగా ఉన్నామని ప్రజలకు తెలిసింది. దీంతో మేము కూడా బాధ్యతగా సేవలందిస్తున్నాం. ఇటీవల నాకు సేవామిత్ర పురస్కారం అందింది. పేదవారికి సేవ చేస్తుంటే చాలా సంతృప్తిగా ఉంటుంది. – గీత, వలంటీర్, రంగాపురం సచివాలయం, పలమనేరు

మూడువేలతో నా కష్టాలు తీరినట్టే

జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చినట్టే పింఛను పెంచుతూ ఇప్పుడు నెలకు మూడువేలు చేశారు. చాలా సంతోషంగాగా ఉంది. నెలకు అవసరమైన మాత్రలు, మా అవసరాలకు ఈ డబ్బు ఉపయోగపడుతోంది. ఆ బిడ్డ చేస్తున్న సాయం ఎన్నటికీ మరువలేమయ్యా. ఒకటో తేదీ వచ్చిందంటే చాలు ఇంటికే వచ్చి పింఛను డబ్బు ఇస్తాండారు. ఇకపై నాకు ఏ దిగులూ లేదయ్యా. – సరోజమ్మ, బ్రాహ్మణవీధి, వీ.కోట

హామీలన్నీ నెరవేర్చిన ప్రభుత్వం

సదుం: ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బూరగమందలో మంగళవారం సాయంత్రం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన వారికి వివరించారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మకుండా వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వెంకటరెడ్డి, గణేష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, బాగిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

సిగరెట్ దెబ్బకు రూ.30వేల ఆస్తినష్టం!

చౌడేపల్లె: కాల్చి పడేసిన సిగరెట్ దెబ్బకు ఆస్తి నష్టం సంభవించిన సంఘటన మండలంలోని ఏ.కొత్తకోట పంచాయతీ అంకుతోటపల్లెలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. గ్రామస్తుడు వెంకటరమణకు చెందిన గడ్డివామి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడంతో మంటలు చెలరేగాయి. ఈ సంఘటనలో రూ.30 వేల విలువ చేసే గడ్డి కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న పుంగనూరు ఫైర్ సిబ్బంది సుబ్రమణ్యం, సుమన్, ఇమ్మాన్యుయేల్ సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలం ముంగర మడుగు క్రాస్ వద్ద మంగళవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేశారు. మద్యం విక్రయిస్తున్న రమేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతని నుంచి 37 కర్ణాటక మద్యం బాటిళ్లతో పాటు మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ట్రైనీ ఏఈఎస్ శ్రీరాం, హెడ్ కానిస్టేబుల్ కష్టయ్య, సుబ్రమణ్యం గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు


కబడ్డీ క్రీడాకారులతో సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు

పుంగనూరు: మండలంలోని చంద్రమాకుపల్లెలో మంగళవారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా కబడ్డీ పోటీలను ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ నారాయణ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణస్థాయి పూర్తి కాగానే మండల స్థాయి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం ఉత్సాహంగా కబడ్డీ జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం


వి.కోట: మందుల కిట్‌ను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


సదుం: శిబిరానికి హాజరైన రోగులు, ఆరోగ్య సిబ్బంది

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఎంతో మందికి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చిందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాముగానిపల్లె గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజారోగ్యానికి పెద్దపీట వేసి అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన లభించిందని, ఇప్పుడు మరో పర్యాయం మరింత సమగ్ర వైద్యసేవలు అందివ్వడానికి ఈ కార్యక్రమాన్ని కొన్ని నెలల పాటు ప్రభుత్వం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. శిబిరంలో అన్ని రకాల రకాల వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శిబిరంలో వైద్య సదుపాయాలు, స్టాళ్లను ఆయన పరిశీలించారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్‌నాయక్, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, తహసీల్దార్ చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మారేడుపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష 2

గంగవరం: జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరాన్ని మండలంలోని గంగవరం–3 మారేడుపల్లెలో మంగళవారం నిర్వహించారు. 206 మంది వైద్యాధికారులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, గత ఆరోగ్య సురక్షలో పరీక్షలు చేసుకున్న ప్రజలకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ చంద్రమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, ఎంపీటీసీ కేశవులు, జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, వైద్యాధికారి శ్రీనివాసులు, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

బందార్లపల్లె పంచాయతీలో..

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లె పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష 2 కార్యక్రమం నిర్వహించారు. 238 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కొందరిని మెరుగైన చికిత్స కోసం కుప్పం ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు లోకేష్, దీప, హరిత, స్థానిక సర్పంచ్ రాజగోపాల్, ఎంపీడీఓ రాధాకృష్ణ, స్థానిక నేతలు రామకృష్ణారెడ్డి, సుగుణప్ప, కేశవరెడ్డి పాల్గొన్నారు.

మొరవపల్లె సచివాలయంలో..

సదుం: మండలంలోని మొరవపల్లె సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2 వైద్య శిబిరం నిర్వహించారు. 311 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశామని, వీరిలో ఏడుగురిని మెరుగైన వైద్యానికి రెఫర్ చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ చరణ్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాస్, అనురాధ, సర్పంచ్ జగన్నాథం, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, హెల్త్ సూపర్‌వైజర్లు నీలకంఠ, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.


గంగవరం : మారేడుపల్లెలో..


రామకుప్పం : బందార్లపల్లెలో..

పేదల తలరాతను మార్చిన సీఎం


వైద్యశిబిరంలో బీపీ పరీక్షించుకుంటున్న ఎంపీ రెడ్డెప్ప

- దింపుడు కళ్లెంపై టీడీపీ
- అభివృద్ధి నిరోధకులుగా మారిన బాబు, పవన్ కళ్యాణ్
- చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు విమర్శ

బైరెడ్డిపల్లె: పేదల జీవితాల్లో వెలుగులు నింపి, వారి తలరాతను మార్చాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె సచివాలయంలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2' కార్యక్రమాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగు కోసం సీఎం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న చంద్రబాబు తన పాలనలో దోపిడీకి అధిక ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని దివాలా తీసేలా చేసి పేదల నోట్లో మట్టి కొట్టారని దుయ్యబట్టారు. దింపుడు కళ్లెం లాంటి టీడీపీని నమ్మే స్థితిలో జనం లేరన్నారు. అర్హులందరికీ కూడు, గూడు, విద్య, వైద్యం, తాగునీరు, కనీస వసతులు కల్పించి జగనన్న ఆదుకుంటుంటే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, ఎల్లో మీడియా కోర్టుకు వెళ్లి అభివృద్ధికి అవరోధులుగా మారారని మండిపడ్డారు. మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించి రెండవసారి ముఖ్యమంత్రి చేసుకుంటే సంక్షేమాన్ని కొనసాగిస్తారని, మరింత అభివృద్ధి పథంలోకి రాష్ట్రాన్ని తీసుకెళ్తారన్నారు. వైద్యులు శిబిరంలో పేదలను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాజంపేట ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, సర్పంచ్ వెంకటేష్, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్ కుమార్, శాలిని, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

7న వన్నియ కుల క్షత్రియ సమావేశం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ భరత్, వన్నియ కుల క్షత్రియ నాయకులు

శాంతిపురం: ఈ నెల 7న కనుమలదొడ్డిలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న వన్నియ కుల క్షత్రియ కులస్తుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ కుల నాయకులు కోరారు. సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో విడుదల చేశారు. కార్యక్రమంలో కుప్పం, శాంతిపురం మండలాల పార్టీ కన్వీనర్లు మురుగేష్, బుల్లెట్ దండపాణి, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాలకు ప్రభుత్వ భూమి కేటాయించరూ!

శాంతిపురం: రాళ్లబూదుగూరు పంచాయతీ సాతు రెవెన్యూలోని 4.90 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు ఇంటి స్థలాలు, ప్రజావసరాలకు కేటాయించాలని స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్‌ను కలిసి వారు వినతి పత్రం ఇచ్చారు. పంచాయతీలో ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న 90 మంది లబ్ధిదారుల అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వారు కలెక్టర్‌కు నివేదించారు. విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురి కాకుండా చూడాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో స్థానిక సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ రమేష్, మండల కో–ఆప్షన్ సభ్యుడు నిసార్ తదితరులు ఉన్నారు.


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అంబేడ్కర్ భవన్ నిర్మించాలని..

వి.కోట: అంబేడ్కర్ భవనం నిర్మించాలని కోరుతూ మండల దళిత సంఘాల నేతలు మంగళవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద సామూహిక నిరాహార దీక్ష చేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ, స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో 28 సెంట్ల స్థలంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి గత ప్రభుత్వ పాలనలో పునాదులు వేశారని, ఆ తర్వాత నిర్మాణాన్ని విస్మరించారన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు స్పందించి నిర్మాణ పనులు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నేతలు బాస్ గణపతి, వినోద్, శివరాం, విశ్వనాథ్, గిరి, సుబ్రమణ్యం, తంగరాజు, దొరస్వామి, గోపి తదితరులు పాల్గొన్నారు.


నిరాహార దీక్ష చేస్తున్న దళిత నేతలు

నేడు పింఛన్ల మహోత్సవం

పలమనేరు: సామాజిక పింఛన్‌ను రూ.2750 నుంచి రూ.3వేలకు ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో పింఛన్ల మహోత్సవం పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 9.30 గంటలకు వీ.కోటలో, మధ్యాహ్నం 3 గంటలకు పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో, సాయంత్రం 4 గంటలకు పెద్దపంజాణిలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలియజేసింది. ఆయా మండలాల వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరింది.

శాంతిపురంలో..

శాంతిపురం: పెంచిన పింఛన్లు మండలంలో బుధవారం నుంచి పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ హేమమాలిని తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల సచివాలయ ప్రాంగణంలో పింఛనుదారులకు చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లు, నాయకులు పాల్గొనాలని ఆమె కోరారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: కొత్తగా మంజూరైన 88 మందికి కొత్త పెన్షన్ల పంపిణీతోపాటు ప్రభుత్వం పెంచిన పెన్షన్ రూ.3 వేల చొప్పున లబ్ధిదారులకు బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేయనున్నట్టు ఎంపీపీ రామమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు తెలిపారు.